కేవీపీఎస్ పోరాటాలు అభినందనీయం



కేవీపీఎస్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ

ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ

నిజాంపేట్: సామాజిక తత్వవేత్తలు, మహనీయులు మనందరికీ మార్గదర్శకులని, ఆ మహనీయుల స్ఫూర్తితో కేవీపీఎస్ ప్రచురించిన కేలండర్ అభినందనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం మంత్రి చాంబర్‌లో కేవీపీఎస్–2024 నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహనీయుల స్ఫూర్తితో కేవీపీఎస్ నిర్వహిస్తున్న సామాజిక ఉద్యమాలు ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని, ప్రతిఘటన శక్తిని పెంపొందిస్తున్నాయని అన్నారు.

◆ ఎస్సీ ఎస్టీ కమిషన్ కోసం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం కోసం కేవీపీఎస్ నిర్వహించిన పోరాటాలు అభినందనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం కోసం ఉద్యమం జరిగినప్పుడు తాను ఉపముఖ్యమంత్రిగా ఉండి దళిత గిరిజనుల నిధులకు చట్టబద్ధత కల్పించే అవకాశం తనకే దక్కడం సంతోషం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, కేవీపీఎస్ నగర అధ్యక్ష కార్యదర్శులు దశరథ్, సుబ్బారావు, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షీని కలిసిన బైరి భాస్కర్‌గౌడ్



దీపాదాస్ మున్షీని సన్మానిస్తున్న బైరి భాస్కర్‌గౌడ్

సుభాష్‌నగర్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని సీనియర్ నేత బైరి భాస్కర్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ఇటీవల నియమించిన తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల కాంగ్రెస్ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీని సోమవారం రాత్రి నగరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థి దశ నుంచి గత 40 ఏళ్లుగా కాంగ్రెస్‌లో పనిచేస్తున్నానని ఆమెకు తెలిపారు.

బాచుపల్లి ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన సీపీఐ నాయకులు



బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌రావుతో సీపీఐ నాయకులు

నిజాంపేట్: బాచుపల్లి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఉపేందర్‌రావును మంగళవారం సీపీఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్‌ను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్, వెంకటేష్, హరినాథ్ రావు, సదానందంరెడ్డి, డిలేశ్వర్‌రావు, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

పద్మానగర్ ఫేజ్-1లోని గాయత్రి అపార్ట్‌మెంట్‌లో అక్షతలు పంపిణీ చేస్తున్న భక్తులు



నిజాంపేట జర్నలిస్ట్ కాలనీలో అక్షతలను పంపిణీ చేస్తున్న రామభక్తులు



వైభవంగా అయోధ్య రామయ్య

అక్షత కలశ ఊరేగింపు

- భక్తులతో కలిసి కలశంతో ఊరేగింపుగా వెళ్లిన కూన శ్రీశైలంగౌడ్
- 22న ఇంటి వద్ద దీపాలు వెలిగించిన వేడుకలు జరుపుకోవాలని వినతి



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు అక్షతలను అందజేస్తున్న రామభక్తులు



కలశంతో ఊరేగింపుగా వస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: అయోధ్యలో దేశ ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ఈనెల 22వ తేదీన రామ మందిర ప్రారంభోత్సవం జరుగుతుందని.. అదేరోజు ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి వేడుకలు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్ కోరారు. అయోధ్య నుంచి వచ్చి శ్రీరాముని పూజిత అక్షతలను షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో రామభక్తులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ అక్షతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. దేశమంతా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. అక్షతలను ప్రతి ఇంటికి చేరే విధంగా కృషి చేస్తామన్నారు.

◆ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో నిజాంపేట జర్నలిస్ట్ కాలనీలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు నడుమ కాలనీ వీధుల్లో అక్షతలతో కూడిన కలశాన్ని ఊరేగిస్తూ గడపగడపకు అక్షతలను అందించారు. కాలనీ మహిళలు జ్యోతులతో హారతులు పట్టి అయోధ్య రాముడి అక్షతలను పొందారు. శ్రీరాముడి అక్షింతలను స్వీకరించే క్రమంలో మహిళలు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

◆ కాలనీలోని సబ్ స్టేషన్ వద్ద ప్రారంభమైన ఈ ఊరేగింపు అన్ని రోడ్ల మీదుగా కొనసాగించి ఇంటింటికి అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. ఊరేగింపు కార్యక్రమంలో దామెర జగదీశ్వర్ గుప్తా, మండడి మారుతికుమార్, కోట కృష్ణారావు, మహేష్, మల్లికార్జున్, రాముయాదవ్, లాలయ్య, గోవిందరావు, రమేష్, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, దాలి నాయుడు, ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు వాణితో పాటు కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని భౌరంపేట్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు.

భౌరంపేట్ ఫీడర్ పరిధిలో...
శంభీపూర్, మహేశ్వరం, ప్రణీత్ బ్లూమ్స్, లాండ్‌మార్క్ 1, 2, కీర్తి హోమ్స్, సుకృతి విల్లాస్, భౌరంపేట్‌లోని ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు..

భౌరంపేట్ ఏజీఎల్ ఫీడర్ పరిధిలో..
వజ్రా విల్లాస్, ల్యాండ్‌మార్క్–3 విల్లాస్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మధురనగర్ ఫీడర్ పరిధిలో...
ఇన్‌కాయిస్ రోడ్డు, మోర్ సూపర్ మార్కెట్ రోడ్డు, అంబ భవానీ హోటల్, ప్రగ్నా స్కూల్ ఏరియాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు..

ఎలిఫెంట సర్కిల్ పరిధిలో...
ఎలిఫెంట్ సర్కిల్, ప్రగతి సెంట్రల్ స్కూల్, త్రీమంకీస్ చౌరస్తా ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రగతినగర్ సెక్షన్ ఏఈ తెలిపారు.

విభిన్న భాషల ఐక్యతే మన విశిష్టత

సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ ఆచార్య సి మృణాళిని

రాయదుర్గం: విభిన్న భాషలు ఉన్నప్పటికీ వాటి మధ్య ఐక్యత కొనసాగడమే భారతదేశ విశిష్ట లక్షణమని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు విభాగ కన్వీనర్, సిలికానాంధ్ర(యూఎస్ఏ) తెలుగు శాఖ అధ్యక్షురాలు ఆచార్య సి.మృణాళిని పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో మానవీయశాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ ఆడిటోరియంలో మంగళవారం భారతీయ భాషోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన మృణాళిని మాట్లాడుతూ.. మహాభారతాన్ని మూలంలో భావం కోల్పోకుండా తెలుగులోకి అనుసృజన చేసిన గొప్పతనం కవిత్రయ భారతానికి చెందుతుందన్నారు. వ్యాస మహాభారతంలోని పరమార్థాన్ని యథాతథంగా తెలుగులోకి తీసుకొచ్చారన్నారు. తెలుగు ప్రజలకు భక్తి కంటే లౌకి విషయాలపై ఆసక్తి ఎక్కువని చెప్పారు. ఆ దిశగానే సాహిత్యం కూడా వెలువడిందన్నారు. సుబ్రహ్మణ్య భారతి తన రచనల్లో కందుకూరి వీరేశలింగం పంతులుని ఒక పాత్రగా చేసిన ఆయన గొప్పతనాన్ని వర్ణించారని గుర్తుచేశారు. ఆమె తమిళ కవి అయినప్పటికీ తెలుగుని సుందరమైన భాషగా ప్రశంసించారన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ కూడా 24 భాషల్లో జాతీయ స్థాయి పురస్కారాలను అందిస్తోందన్నారు. అనంతరం డీన్ ప్రొఫెసర్ వి.కృష్ణ మాట్లాడుతూ.. భారతీయ భాషా దినోత్సవం భారతీయ సమైక్యతకు నిదర్శంగా భావించాలన్నారు. ఇఫ్లూ యూనివర్సిటీ అనువాద శాఖ అధ్యక్షుడు ఆచార్య వీబీ తారకేశ్వర్ మాట్లాడుతూ.. విభిన్న భాషలకు కేంద్రంగా భారతదేశం కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా హిందీ శాఖ అధ్యక్షుడు ఆచార్య సి.అన్నపూర్ణ సుబ్రహ్మణ్య భారతి కవితలను, ఆచార్య పిల్లలమర్రి రాములు తెలుగు కవితను ఆలపించారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు వ్యవహరించిన ఈ సమావేశంలో ఆచార్యులు బి.భీమయ్య, ఏఎం ఫజలుల్లా, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

హరివర్ధన్‌రెడ్డిని కలిసిన మైనారిటీ సభ్యులు

జగద్గిరిగుట్ట: మేడ్చల్–మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డిని మైనారిటీ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో టీపీసీసీ మైనారిటీ విభాగం రాష్ట్ర జాయింట్ కన్వీనర్ సమీర్ ఖాన్, మేడ్చల్ మల్కాజిగిరి మైనారిటీ విభాగం జాల్లా అధ్యక్షుడు, అడ్వకేట్ హుస్సేన్ మహమ్మద్ ఉన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోపార్టీ కోసం కృషి చేయాలని తెలిపినట్లు వారు పేర్కొన్నారు.



డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డిని సత్కరిస్తున్న మైనారిటీ సభ్యులు

హుండీ ఆదాయం లెక్కింపు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టపై ఉన్న శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం హుండీ లెక్కింపు చేపట్టారు. ఆలయ కమిటీ సమక్షంలో హుండీ డబ్బులను లెక్కించారు. నాలుగు నెలలుగా హుండీ ఆదాయం రూ.2,90,410 వచ్చిందని దేవాదాయ శాఖ తెలిపింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేణుగోపాల్‌యాదవ్, ఈఓ కృష్ణమాచార్యులు, పర్యవేక్షణ అధికారి వీవీ సుబ్రమణ్యం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ల అందజేత

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని భూదేవిహిల్స్‌లో దుర్గాబాయి మహిళా వికాస కేంద్రం ఆధ్వర్యంలో టైలరింగ్ బ్యూటీషియన్ శిక్షణ గతేడాది సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యింది. శిక్షణ పూర్తి కావడంతో బుధవారం సర్టిఫికెట్లను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యాక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వివేకనంద్, కార్పొరేటర్ జగన్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు వారు తెలిపారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు

సుభాష్‌నగర్: పేట్‌బషీరాబాద్, సర్వే నం.25/1లో ప్రభుత్వ భూమికబ్జా విషయమై మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఏ–బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆర్ఐ రేణుకకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. వందలాది కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కొంత మంది బడాబాబులు బీఆర్ఎస్ నేతల అండదండలతో కబ్జాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇప్పటికే చాలా ప్రాంతం కబ్జా చెరలో చిక్కుకుందన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి సదరు స్థలాన్ని కాపాడాలని కోరారు.



ఆర్ఐ రేణుకకు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నేత బండి శ్రీనివాస్‌గౌడ్

రేపు 'సాక్షి' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ వెంకటేశ్వర నగర్‌లోని సత్‌జ్ఞాన్ స్కూల్‌లో 'సాక్షి'ఆధ్వర్యంలో ఈనెల 11న ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశంయాదవ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ పోటీల్లో ఉత్తమ ముగ్గులు వేసిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలిచే మహిళలు తమ వెంట రంగులు తెచ్చుకోవాలని మల్లేశంయాదవ్ కోరారు.

బస్తీ దవాఖానాలో దొంగలు పడ్డారు

- సర్జికల్, బీపీ మెషిన్లు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లిన వైనం

దుండిగల్: బస్తీ దవాఖానాలో దొంగలు పడ్డారు. అందులోని సర్జికల్ పరికరాలు, బీపీ మెషిన్లు, ఇతర సామగ్రిని దొంగలించారు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి పరిధి సర్వే నం.120లో ఆరు నెలల క్రితం బస్తీ దవాఖానా ఏర్పాటు చేశారు. అందులో సామగ్రిని సమకూర్చారు. కానీ ఎన్నికల నేపథ్యంలో దవాఖానాను ప్రారంభించడంలో తీవ్ర ఆలస్య అయ్యింది. దీంతో అప్పటి నుంచి దవాఖానాకు తాళం వేసి ఉంది. ఇదే అదనుగా భావించిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి అందులోని సామగ్రిని ఎత్తుకెళ్లారు. అంతేకాకుండా ప్లాస్టిక్ కుర్చీలను ధ్వంసం చేయడం గమనార్హం. డిసెంబరు 23వ తేదీన దొంగతనం జరిగినట్లు వైద్య సిబ్బంది ఆలస్యంగా గుర్తించారు. మంగళవారం డాక్టర్ శివాని ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కులగణన కోసం నేడు సత్యాగ్రహం

రాయదుర్గం: ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఓబీసీఎస్ఏ) ఆధ్వర్యంలో హెచ్‌సీయూ ప్రధాన గేటు ఎదుట నేడు(బుధవారం) ఓబీసీ సత్యాగ్రహం జరగనుంది. కులగణన, సామాజిక న్యాయం కోసం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఈ కార్యక్రమం చేస్తున్నట్టు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ వెంకటేష్, ఆళ్ల రామకృష్ణ, భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.

భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది

డబ్ల్యూఆర్ఐ ఇండియా సీనియర్ ఫెలో ప్రొఫెసర్ అమితాబ్ కుందు



రాయదుర్గం: భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని డబ్ల్యూఆర్ఐ ఇండియా సీనియర్ ఫెలో ప్రొఫెసర్ అమితాబ్ కుందు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళవారం 'ఇండియా టువర్డ్స్ ఇన్‌క్లూజివ్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అవకాశాలు, చాలెంజెస్' అనే అంశంపై వ్యవస్థాపక దినోత్సవ ప్రత్యేక ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా అమితాబ్ మాట్లాడుతూ.. బ్రూకింగ్స్ ప్రాజెక్షన్ ఆఫ్ షేర్ సంస్థ 2028 నాటికి భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా అంచనా వేసిందని గుర్తు చేశారు. లేబర్ మార్కెట్ యాక్సెస్‌లో ఉన్న అసమానతలు కొద్దిగా తగ్గుతాయన్నారు. 2050లో భారతదేశ వాటా 27 శాతంగా ఉండవచ్చని ఆసియా అభివృద్ధి బ్యాంకు అంచనా వేసిందన్నారు. అనంతరం 'మనూ' చాన్స్‌లర్ ముంతాజ్‌అలీ మాట్లాడుతూ.. త్వరలో నిర్వహించే ఉర్దూ విశ్వవిద్యాలయ కాన్వకేషన్‌కు రాష్ట్రపతిని ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. దేశాభివృద్ధిలో ఆర్థిక వ్యవస్థ, విద్య కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ.. త్వరలో స్కూల్ ఆఫ్ లా విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. కార్యక్రమంలో 'మనూ' ఓఎస్‌డీ–1 ప్రొఫెసర్ షుగుఫ్తా షాహీన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్లు సయ్యద్ షా మహ్మద్ మజారుద్దీన్ ఫారూఖీ, అమీనా కిషోర్, నసీముద్దీన్, ఎస్ఎం రహమతుల్లా, తహసీన్ బిల్గ్రామి, పీఎస్ మునవర్ హుస్సేన్‌ఖాన్, మల్లిక, షేక్ మహ్మద్ సీపీడీయూఎంటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంఏ సమీ సిద్దిఖీ, మహ్మద్ ముస్తఫా అలీ సర్వారీ, మేరాజ్ అహ్మద్, ఐఎంసీ డైరెక్టర్ డాక్టర్ రిజ్వాన్ అహ్మద్ పాల్గొన్నారు.

సాంకేతిక విద్యలో నాణ్యత పెంపుపై దృష్టి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ప్రభుత్వం సాంకేతిక విద్యలో నాణ్యత పెంపు పై దృష్టి సారించినట్లు ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యాదర్శి బుర్ర వెంకటేశం పేర్కొన్నారు. మంగళవారం ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో ఏఐసీటీఈ విస్తృత స్థాయి అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా ఏఐసీటీఈ వైస్ చైర్మన్ డాక్టర్ అభయ్‌జెరే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వివిధ వృత్తి విద్య కళాశాలల నిర్వాహకులు హాజరయ్యారు. సాంకేతిక విద్యలో వస్తున్న మార్పులు, నూతన అనుమతులు, నిబంధనలు, ఇతర సందేహాలను పలువురు వక్తలు నివృత్తి చేశారు.

సావిత్రీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నేటి మహిళలు సావిత్రీ బాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఓయూ మహాత్మా జ్యోతి బాయి పూలే పరిశోధన కేంద్రం డైరెక్టర్ డా.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మెదక్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కాలేజీ సాధికారత విభాగం, ఓయూ ఆధ్వర్యంలో స్త్రీ విద్యకోసం సావిత్రీబాయి పూలే విశిష్ట సేవలు అనే అంశం పై వర్క్‌షాప్ జరిగింది. కార్యక్రమానికి ప్రిన్సిపల్ డా.హుస్సేన్ అధ్యక్షత వహించగా డా.వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మహిళల విద్యాభివృద్ధి కోసం సావిత్రీబాయి చేసిన సేవలను వివరించారు. వర్క్‌షాప్‌లో సాధికారత కన్వీనర్ అన్నపూర్ణ, వైస్ ప్రిన్సిపల్ సింహారెడ్డి, డా.సుధాకర్, డా.దినకర్, వెంకటేశ్వర్లు, శరత్‌రెడ్డి, వామన మూర్తి మాట్లాడారు.

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: అత్యధిక మెజార్టీతో మూడోసారి గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. 3వ రోజు కృతజ్ఞత యాత్రలో భాగంగా మంగళవారం చింతల్ డివిజన్‌లోని ఎన్ఎల్‌బీ నగర్, పద్మశాలినగర్, వివేకానంద నగర్, శ్రీనివాసనగర్‌లలో ఎమ్మెల్యే పర్యటించగా స్థానిక ప్రజలు ఆయనకు పూల వర్షంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తాను చేసిన అభివృద్ధే తనను గెలిపించిందన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ రఫీ, మక్సూద్ అలీ, వెంకటేష్‌గౌడ్, సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

◆ **అమ్మవారిని కొలిస్తే మానసిక ప్రశాంతత..**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలోని శ్రీ సప్త మాతృక దేవస్థానంలో నిర్వహించిన శ్రీ సప్తమాతృక రాధమ్మ దేవిల శతచండీ యాగ పూర్ణాక పుష్కర మహా కుంభాభిషేకం వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణగా ఒక్కో అవతారంలో ఒక్కో అమ్మవారు ఉంటారని.. అమ్మవారిని కొలవడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలారెడ్డి, కార్పొరేటర్లు కాసాని సుధాకర్ ముదిరాజ్, ఆగం రాజు ముదిరాజ్, గాజుల సుజాత, బాలాజీ నాయక్, కొలన్ వీరేందర్ రెడ్డి, కాసాని శిరీష వీరేష్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

◆ **మన్యుసూక్త నవగ్రహ రుద్రచండీ హోమం..**

జీడిమెట్ల డివిజన్ ఎంఎన్‌రెడ్డి నగర్‌లోని కాశీ విశ్వేశ్వరాలయంలో నిర్వహించిన మన్యుసూక్త నవగ్రహ రుద్రచండీ హోమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పీఎస్ శంకర్, కోశాధికారి జి.భవత్, ముఖ్య సలహాదారులు ఎం.చంద్రారెడ్డి, శివరాంరెడ్డి, దేవాలయ అధ్యక్షుడు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ రావు ఉన్నారు.



చింతల్‌లో జరిగిన కృతజ్ఞత యాత్రలో ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరించిన సంక్షేమ సంఘాల నాయకులు

మల్కాజిగిరి ఎంపీ టికెట్

స్థానికులకే ఇవ్వాలి

- స్థానిక నాయకులు, కేడర్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి
- రాబోయే పురపాలిక, జీపీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకోవాలి
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్‌కు కూడా చెప్పాం
- మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర, శివారు జిల్లాల నేతలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరి టికెట్ స్థానికులకు మాత్రమే కేటాయించాలని బీజేపీ నాయకులు కోరారు. స్థానికేతరులకు టికెట్ ఇవ్వవద్దని పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు వన్నాల హరీష్ రెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో దాదాపు 38 లక్షల ఓటర్లు ఉంటారని, మినీ భారత్‌గా.. ఈ నియోజకవర్గానికి గుర్తింపు ఉందని వారు తెలిపారు. స్థానికేతరులకు ఎంపీ టికెట్ కేటాయిస్తే పార్టీకి నష్టం కలుగుతుందని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. టికెట్ కేటాయింపులో ఈ ప్రాంత ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను అధిష్టానం పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రతిభావంతులు, ప్రభావశీలురైన నాయకులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలోని ఏ నాయకుడికి ఎంపీ టికెట్ కేటాయించినా కలిసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని వారు స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, మున్సిపల్, గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎంపికలో స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో నిరుత్సాహానికి గురైన కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు స్థానిక నాయకులకు ఎంపీ టికెట్ కేటాయించాలని అధిష్టానాన్ని బీజేపీ నాయకులు కోరారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి,బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి,రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ నాయకులు డా.కె.లక్ష్మణ్ దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు వారు పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాలి సంపత్ యాదవ్, నాయకులు భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

లిఫ్ట్ గుంతలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



కుత్బుల్లాపూర్: నిర్మాణంలో ఉన్న ఓ భవన లిఫ్ట్ గుంతలో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. కొంపల్లి జయభేరి ప్రాంతంలోని సర్వే నం.136లో నిర్మాణంలో ఉన్న ఓ భవన లిఫ్ట్ గుంతలో మంగళవారం ఓ మహిళ(45) మృతదేహం పడి ఉండటంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు గుంతలో పడి మృతి చెందిందా లేక మరే ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.